ఘనంగా నాగుల పంచమి

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రం ధర్మపురి, కోరుట్ల, కోరుట్ల రూరల్, మెట్‌పల్లి, మెట్‌పల్లిరూరల్, కథలాపూర్, ఇబ్రహీంపట్నం, పెగడపల్లి, మల్యాల, మల్లాపూర్, రాయికల్‌లోని అన్ని గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో పుట్టల్లో పాలు పోసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



పొరండ్లలో భీమన్న ఆలయ సమీపంలో పుట్టలో పాలుపోస్తున్న మహిళలు



కథలాపూర్: పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



రాయికల్‌లో మహిళల పూజలు



ధర్మపురిలో పుట్ట వద్ద మహిళల పూజలు

బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు

కోరుట్ల: కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తనయుడు డాక్టర్ సంజయ్ పేరును సీఎం కేసీఆర్ ప్రకటించడంతో పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి, టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

ఇబ్రహీంపట్నం: కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ సంజయ్‌ను సీఎం ప్రకటించడంతో ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి నినాదాలు చేస్తూ సంబరాలు చేశారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్,బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



కోరుట్లలో బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్, మాదాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు టపాకాయలు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.

జగిత్యాలలో..

జగిత్యాలరూరల్: జగిత్యాల అసెంబ్లీ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించడంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.



తిప్పన్నపేటలో బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు

సారంగాపూర్: జగిత్యాల ఎమ్మెల్యేగా పోటీచేయడానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను ప్రకటించడంపై సోమవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాలతో పాటు, పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు బాణసంచా కాల్చి సంతోషాన్ని పంచుకున్నారు.

రాయికల్: బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సంజయ్‌కుమార్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించడంతో సోమవారం రాయికల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బర్కం మల్లేశం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో సంబురాలు

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గం బీఆర్‌ఎస్ టికెట్ చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు కేటాయించడంతో కథలాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం సంబరాలు జరిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, మాజీ ఎంపీటీసీ మామిడిపెల్లి రవి, నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి: వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చల్మెడ లక్ష్మీరసింహారావుకు టికెట్ దక్కడంతో మేడిపల్లి, భీమారం మండల కేంద్రాలు, గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంబరాలు చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మల్యాలలో..

మల్యాల: చొప్పదండి నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు సీఎం కేసీఆర్ టికెట్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మల్యాల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు టపాసులు పేల్చి, సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు పాల్గొన్నారు.

కొండగట్టు: చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థిగా సుంకె రవిశంకర్‌కు సీఎం కేసీఆర్ అవకాశం ఇవ్వడంతో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు పీఏసీఎస్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు నాయకులు పాల్గొన్నారు.



మల్యాలలో నాయకుల సంబురాలు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

• ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్: గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాయికల్ మండలం ఇటిక్యాలలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం, రూ.5 లక్షలతో పల్లెప్రకృతి వనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో ముదిరాజ్, ఎస్సీ సంఘ భవనాలకు భూమిపూజ చేశారు. రాయికల్ పట్టణంలో మున్సిపల్ కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన 200 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల అభివృద్ధే తన ధ్యేయంగా పనిచేస్తున్నానని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో ప్రతి ఇంట్లో లబ్ధిదారులున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఇటిక్యాల సర్పంచ్ సామల్ల లావణ్య, ఏఎంసీ చైర్మన్ మారంపల్లి రాణి, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, రాయికల్‌లో సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

'హత్యలపై ఎమ్మెల్యే స్పందించకపోవడం సిగ్గుచేటు'

మెట్‌పల్లి: కోరుట్ల నియోజకవర్గంలో వరుసగా హత్యలు జరుగుతున్నప్పటికీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు స్పందించకపోవడం సిగ్గు చేటని సుప్రీంకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు కొమొరెడ్డి కరం విమర్శించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. హత్యలతో ప్రజలు ఆందోళన చెందుతుంటే.. భరోసా ఇవ్వాల్సిన ఎమ్మెల్యే, ఆయన తనయుడు, బీఆర్‌ఎస్ నాయకులు టిక్కెట్ పేరుతో సంబరాలు జరుపుకోవడం బాధాకరమన్నారు. హత్యలకు పాల్పడుతున్న నిందితులపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎర్రాల హన్మాండ్లు, యామ రాజయ్య, గంగారెడ్డి, లింగారెడ్డి, రైసుద్దీన్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కథలాపూర్: మండలంలోని సిరికొండలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి మండల రైతు సంఘం అధ్యక్షుడు గడ్డం భూమారెడ్డి సోమవారం రూ.20 వేలు విరాళం అందించారు. గౌడ సంఘం సభ్యుల విన్నపం మేరకు విరాళం అందించామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గౌడ సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

వైకుంఠరథం వితరణ

మేడిపెల్లి: మండలంలోని కాచారం సర్పంచ్ చిట్యాల సురేశ్ తన తల్లి గంగపోషవ్వ జ్ఞాపకార్థం తన సొంత ఖర్చులతో చేయించిన వైకుంఠ రథంను గ్రామానికి అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దమనుషులు, యువకులు, పాల్గొన్నారు.

'బీజేపీ, టీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలి'

మల్లాపూర్: బీజేపీ, టీఆర్‌ఎస్‌ల ప్రభుత్వాల వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసే విధంగా ఎండగట్టాలని పీసీసీ సభ్యుడు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంతో పాటు రేగుంట, చిట్టాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తమ ఓటు ద్వారా గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, రేగుంట ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, చిట్టాపూర్ సర్పంచ్ సాయికుమార్, నాయకులు పాల్గొన్నారు.

23 నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

రాయికల్: ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు రాయికల్ పట్టణంలో మండలస్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో గంగాధర్ సోమవారం తెలిపారు. 23న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 24న బాలురకు కబడ్డ, ఖోఖో, వాలీబాల్, 26న బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పీడీ పుష్పలత, పీఈటీ శ్రీనివాస్, సుజాత, చంద్రకళ, ప్రభాస్, దేవేందర్, గంగాధర్ ఉన్నారు.

గుండెపోటుతో మాజీ ఉపసర్పంచ్ మృతి

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ చౌట్‌పల్లి అంజయ్య(45) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అంజయ్య సుమారు 20 ఏళ్లుగా కోరుట్ల, కథలాపూర్ ఏరియాలో బైక్ రిపేరర్‌గా సుపరిచితుడు. 10 సంవత్సరాల క్రితం ఊట్‌పెల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా సేవలందించారు. సోమవారం ఉదయం గుండెపోటుకు గురికాగా చికిత్స కోసం కరీంనగర్ ఆసపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంజయ్య మృతిపట్ల కోరుట్ల, కథలాపూర్ మండలాల బైక్ రిపేర్ సెంటర్స్ యూనియన్, ఆటో స్టోర్స్ యూనియన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డుల పంపిణీ

జగిత్యాలజోన్: అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి న్యాయవాదులకు రూ.2 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పిస్తున్నట్లు జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులకు హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యుడు రాజ్‌కుమార్, చీటి రామకృష్ణారావు, కోశాధికారి కటుకం చంద్రమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని న్యాయవాదులకు తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల వెల్ఫేర్ ట్రస్ట్ సలహా మండలి సభ్యుడు పీవీ రాజ్‌కుమార్ సోమవారం హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కోరుట్ల బార్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం న్యాయవాదులకు అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2 లక్షలు ఉన్న ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వం రూ.5 లక్షలకు పెంచాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

పాదయాత్ర విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం: మల్లాపూర్ మండలం ధర్మారం నుంచి ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వరకు కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చేసే పాదయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి క్రిష్ణరావు కోరారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రతీ నెల 22 న కాంగ్రెస్ పార్టీ తరపున పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, అల్లూరి మహేందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ జరిపించాలని ఫిర్యాదు

బుగ్గారం: బుగ్గారం గ్రామపంచాయతీలో కోటి రూపాయలకు పైగా నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఉన్నతాధికారుల విచారణ జరిగినా చర్యలు శూన్యమని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుగ్గారం గ్రామాభివృద్ధి కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఏళ్లు గడుస్తున్న చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు.ముగ్గురు డీపీవోలు మారినా ఇప్పటికీ ఫలితం శూన్యమన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారిచే సమగ్ర విచారణ జరిపించి నిధుల గోల్‌మాల్‌కు కారణమైన సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శులపై చర్యలు చేపట్టాలని కోరారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

మల్లాపూర్: అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్‌ను నిలిపివేయాలని గుండంపల్లి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం మల్లాపూర్‌లో డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఎస్సై నవీన్‌కుమార్, ఎంపీడీవో జగదీశ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. గ్రామపంచాయతీ అనుమతిని నిరాకరించినా పనులు కొనసాగిస్తున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాగులో పడి వృద్ధుడి మృతి

గొల్లపల్లి: మండలంలోని బొంకూర్ గ్రామానికి చెందిన సూరమల్ల బీరయ్య (70)అనే వృద్ధుడు వాగులో పడి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది.కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీరయ్య సోమవారం బహిర్భూమికి వాగులోకి వెళ్లగా, కాలుజారి వాగులో పడిపోయాడు. వాగు వద్ద చెప్పులు,తువ్వాల కనిపించడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి మృతదేహం లభ్యమైంది. మృతుడి కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్యం సాధించాలి

జగిత్యాల: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని ఆర్డీవో నర్సింహమూర్తి సూచించారు. స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ కేడెట్స్ స్టాఫ్ సెక్షన్స్‌లో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీ కేడెట్స్ అరవింద్, రాజ్‌కుమార్, అనిల్ అస్సాం రైఫిల్స్‌లో ఉద్యోగం సాధించడం గొప్ప విషయమన్నారు. ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. సంస్కృతీ నిలయాలు



భూమిపూజ చేస్తున్న సుజిత్‌రావు దంపతులు

మల్లాపూర్: దేవాలయాలు.. సంస్కృతీ నిలయాలని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. సోమవారం మొగిలిపేట శివారులో శ్రీ కోటిలింగేశ్వర శివపంచాయతన నాగేదేవత ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలన్నారు. ప్రపంచంలో ప్రజలంతా ఒక్కటేనని, సమాజమే భగవంతుడి ఆలయమన్నారు. ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు గ్రామాభివృద్ధి కమిటీకి కల్వకుంట్ల సుజిత్‌రావు–చంద్రిక దంపతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో శ్రీలక్ష్మీనరసింహాస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నాయకులు పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, జవ్వాజి ఆదిరెడ్డి, రవీందర్, తిక్క రవి, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలయాలకు నిధులు మంజూరు

కొండగట్టు: కొడిమ్యాల మండలంలోని ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని ఈనెల7న తిరుపతిలో కొడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు టీటీడీ బోర్డు సభ్యుడు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావును చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో కోరారు. స్పందించిన టీటీడీ దేవస్థానం మండలంలోని 15 ఆలయాలకు రూ. 10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. సోమవారం ఆలయాలను టీటీడీ అధికారి రామనాథం ఆలయాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సర్పంచ్ అంబాటి కొండగట్టు బోర్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాగమయ్య ఆలయాన్ని పూర్తిచేయాలి

ధర్మపురి: రోడ్డు వెడల్పు పనుల్లో పురాతన నాగమయ్య ఆలయాన్ని తొలగించి నెలలు గడుస్తున్నప్పటికీ పనులు ప్రారంభించలేదని, వెంటనే ఆలయ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ డిమాండు చేశారు. సోమవారం కమిషనర్ రమేష్‌కు వినతి పత్రం అందించారు. ఆలయం పనులను అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోక పోవడంతో నిర్మాణం ఆగిపోయిందని, వెంటనే స్పందించి ఆలయ పనులను వేగవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న మంత్రి కొప్పుల

వెల్గటూర్: మండలంలోని మొక్కట్రావుపేటకు చెందిన మాస్టర్ శ్రీవర్ధన్ గత కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, శ్రీవర్ధన్ కుటుంబసభ్యులు ఈ విషయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు విన్నవించగా బాధితుడికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం 1.25 లక్షల ఎల్‌వోసీ చెక్కును హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ బాధితుని కుటుంబసభ్యులకు అందించారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

వెల్గటూర్: రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని వెల్గటూర్ సింగిల్ విండో చైర్మెన్ గోళి రత్నాకర్ అన్నారు. రైతులకు రుణమాఫీ డబ్బులు విడుదల చేసిన సందర్భంగా సోమవారం వెలగటూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, సంఘ రైతులు పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌కు టికెట్‌పై సంబురాలు



పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ధర్మపురి: రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించడంపై సోమవారం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ధర్మపురి పట్టణంలోని నంది కూడలి వద్ద టపాసులు పేల్చి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. అంతకముందు ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

చిల్వకోడూర్‌లో పూజలు

గొల్లపల్లి: రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి మరోసారి ధర్మపురి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ సీఎం కేసీఆర్ ప్రకటించడంతో బీఆర్‌ఎస్ నాయకులు రామలింగేశ్వర స్వామి టెంపుల్‌లో పూజలు చేశారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

పెగడపల్లి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్‌ల పనితీరుపై ఓటర్లకు అవగాహన ఉండాలని తహసీల్దార్ ఎంఏ ఫరూక్ అన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం పెగడపల్లిలో ఓటు వేసే విధానం, వాటి పనితీరు పారదర్శకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు వేసిన తరువాత ఓటరు వేసిన అభ్యర్థి గుర్తుకు ఓటు నమోదైందా లేదా అన్న విషయంపై యంత్రాల ద్వారా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, ఎంపీటీసీ జమున, ఆర్‌ఐ అనిల్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, బీఎల్‌వోలు, కారోబార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కార్తికేయ

మెట్‌పల్లి: బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన పూదరి నిషాంత్ కార్తికేయను నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని లింబాద్రి అందజేశారు. నియోజకవర్గంలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా కార్తికేయ పేర్కొన్నారు. నాయకులు బత్తుల లక్ష్మణ్, కోలా రాములు, ప్రభాకర్ తదితరులున్నారు.